క్లుప్తంగా

కబ్జా చేసిన ప్రభుత్వ భూములపై విచారణ


విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి (సైదాపురం): మండలంలోని కోటూరు పల్లిలో ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటున్న విషయంపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'దర్జాగా కబ్జా' కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఇన్‌చార్జి గ్రామ రెవెన్యూ అధికారి రవిని పంపి సర్వే నంబర్ 80లో ఆక్రమించిన ప్రభుత్వ భూములపై విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పేదల భూమి జోలికి వస్తే ఆందోళన చేస్తాం


పొలం వద్ద ఆందోళన చేస్తున్న పేద రైతులు


సైదాపురం: పేదలు సాగు చేసుకుంటున్న భూముల జోలికి వస్తే నిరవధికంగా ఆందోళన చేస్తామని సీపీఎం నేతలు హెచ్చరించారు. వారు ఆదివారం రైతులతో కలిసి మాట్లాడుతూ మండల కేంద్రంలో నిరుపేదలు సాగు చేసుకుని బతుకుతున్నారని చెప్పారు. భూస్వాములకు అధికారులు తొత్తులుగా వ్యవహరించి పేదలు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేసుకోవడంపై తాము పోరాటం సాగిస్తామన్నారు. తమ భూములు తాము సాగు చేసుకునేంత వరకు నిరంతరం ఆందోళన చేస్తామన్నారు.

రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలి


రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ మనోహర్ గౌడ్

చిట్టమూరు: నాయుడుపేట– మల్లాం రహదారి మండలంలోని మల్లాం గ్రామ సమీపంలో తాగేటమ్మ గుడి వద్ద రోడ్డుపై పడిన గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీఓ మనోహర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం తాగేటమ్మ గుడి వద్ద గుంతలను పరిశీలించారు. వెంటనే రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ ఏఈ చిన్నరాయుడుకు సూచించారు. మల్లాంలో ప్రారంభమవుతున్న వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

4 నుంచి కోనలో పవిత్రోత్సవాలు


పెంచలకోన దేవస్థానం

రాపూరు: మండలంలో పెంచలకోనలో వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామికి సెప్టెంబర్ 4 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన అర్చకులు తెలిపారు. 4వ తేదీ సాయంత్రం వేదస్వస్తి, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, మత్స్యంగ్రహణం, అంకురార్పణ, శ్రీవారికి స్నపన తిరుమంజనం, పవిత్రముల ప్రతిష్ఠ, ఆదివాస హోమం, పవిత్ర సమర్పణ ఉంటుందన్నారు. 5వ తేదీ సోమకుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, పవిత్రముల సమర్పణ, ప్రాకారోత్సవం, 6న వేద, దివ్య పారాయణం, హోమం, 7వ తేదీ శేషవాహన సేవ, శాంతి హోమం, పూర్ణాహుతి ఉంటాయని చెప్పారు.


రాపూరు: గ్రామోత్సవంలో కనువిందు చేస్తున్న వినాయకుడు


వాకాడు: తూపిలిపాలెం బీచ్‌లో గణపయ్య విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

ఓ బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా!


గూడూరు పట్టణంలో నిమజ్జనోత్సవంలో కోలాటం వేస్తున్న భక్తులు

వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని ఐదు రోజులుగా వాడవాడలా పూజలందుకున్న బొజ్జ గణపయ్య ఆదివారం నిమజ్జనానికి బయల్దేరారు. వేడుకల్లో ముస్లిం యువత, స్థానికులు, భక్తులు కోలాహలంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. పార్వతీ తనయుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలను భక్తులు వేలంపాటలో దక్కించుకున్నారు. పలు చోట్ల ఏకదంతుడి నగరోత్సవం నిర్వహించారు. విరివిగా అన్నదానాలు చేశారు. కొన్ని చోట్ల ఉట్టి ఉత్సవం నిర్వహించారు. భక్తుల సంబరాల మధ్య విఘ్ననాథుడు నిమజ్జనానికి తరలివెళ్లారు.

– నాయుడుపేటటౌన్/రాపూరు/చిల్లకూరు/వాకాడు


నాయుడుపేట టౌన్ : నిమజ్జనానికి బయల్దేరిన గణనాథులు


వాకాడు: బీచ్‌లో స్నానమాచరిస్తున్న భక్తులు

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించే కార్యక్రమంలో బాగంగా వేప మండలు శరీరానికి చుట్టుకుని ఆలయ ప్రదక్షిణలు చేశారు. ఆలయం వెలుపల పొంగళ్లు సమర్పించారు. దర్శన ఏర్పాట్లను ఆలయ ఈఓ నవీన్ కుమార్ పర్యవేక్షించారు.

దరఖాస్తుదారులు హాజరుకండి

చిల్లకూరు: ఆలయ ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకున్న వారు ధ్రువీకరణ పత్రాలతో సెప్టెంబర్ 2న ఆయా ఆలయాల్లో జరిగే ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని ముత్యాలమ్మ, కోదండరామస్వామి ఆలయాల ఈఓలు ఆదివారం కోరారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద వారు మాట్లాడుతూ ఇటీవల తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ , తమ్మినపట్నంలోని కోదండరామ స్వామి ఆలయాల పాలక మండలి సభ్యుల కోసం పలువురు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. ఈ దరఖాస్తుల పరిశీలనకు దేవదాయశాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి మంగళవారం వస్తున్నట్లు వారు తెలిపారు.

చెరువు ఆక్రమణలను అడ్డుకున్న అధికారులు

కోట: మండలంలోని చంద్రశేఖరపురం వద్ద పెన్నక్క చెరువు ఆక్రమణలపై ఆదివారం ఇరిగేషన్ అధికారులు విచారణ జరిపారు. పెన్నక్కచెరువులో విద్యానగర్‌కు చెందిన కొందరు యంత్రాలతో పనులు చేస్తున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ మునిరత్నం సిబ్బందితో వెళ్లి పరిశీలించి పనులను నిలిపివేశారు. చెరువు ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఏఈ తెలిపారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి


ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను సత్కరిస్తున్న ఏనుగు సుధాకర్‌నాయుడు

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీని పటిష్ట పరిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం వాకాడు మండల పార్టీ కన్వీనర్‌గా నూతనంగా ఎన్నికైన ఏనుగు సుధాకర్ నాయుడుతో పాటుగా పలువురు నాయకులు ఎమ్మెల్సీని కలిశారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రతి పల్లెలో పార్టీ కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఆయన్ను కలిసినవారిలో గూడూరుకు చెందిన సుబాన్, కోట్ల పూడి శ్రీనివాసులు, వాకాడు రవి ఉన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి పర్యటనపై డీఎస్పీ సమీక్ష


ట్రస్ట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సోమవారం పెళ్లకూరులోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్‌కు విచ్చేస్తున్న సందర్భంగా నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంఘమేశ్వర రావు తమ సిబ్బందితో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. చాగణం ట్రస్టీ, ప్రముఖ పారిశ్రామికవేత్త చాగణం గౌరీశంకర్ నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని సీఈవో సీతారామయ్య తెలిపారు. వెంకయ్య నాయుడు పర్యటనకు సంబంధించి తగిన జాగ్రత్తలు చేపడుతున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. వీరి వెంట స్థానిక ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు.

వేంకటేశ్వర స్వామికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాత కుటుంబసభ్యులు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని తిమ్మాజి కండ్రిగ గ్రామ సమీపంలో ఉన్న అభయ అనుగ్రహ వేంకటేశ్వర స్వామికి ఆదివారం పట్టణానికి చెందిన పూనాటి తిరుమల నాయుడు రూ.లక్ష నగదును విరాళం అందించారు. ఆలయ నిర్వాహకులు దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

సీఐటీయూ మండల కమిటీ ఎంపిక

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మండల మహాసభను నిర్వహించారు. సంఘ జిల్లా నేతల సారథ్యంలో సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల అధ్యక్షులుగా మహేష్‌బాబు, కార్యదర్శిగా ముకుందా, సహాయ కార్యదర్శిగా ఎస్. శ్యామలమ్మ, సహా అధ్యక్షులుగా సుజాత, షేక్ కాలేషా, ట్రెజరర్‌గా కే విజయమ్మ, కమిటీ కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

ఓజిలి రజక కమిటీ ఏకగ్రీవ ఎంపిక

నాయుడుపేట పట్టణంలోని ఆదివారం నాడు జరిగిన సమావేశంలో ఓజిలి మండల నూతన రజక కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా పి.శ్రీనివాసులు, సెక్రటరీగా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా లక్ష్మీ, ట్రెజరర్‌గా తూపిలి శ్యామలమ్మ, గౌరవ అధ్యక్షులుగా ఇందిరమ్మ, జయశ్రీ, శ్రీకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

వెంకన్నపాళెంవాసికి డాక్టరేట్


గెంజి సుకుమార్

కోట: మండలంలోని వెంకన్నపాళెం గ్రామానికి చెందిన గెంజి సుకుమార్‌కు నన్నయ యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆయన ఆదివారం తెలిపారు. న్యూ సింథటిక్ మెథడాల జీస్ ఫర్ బెంజిమిడజా-ఇసోక్వినోలిన్ అండ్ అజప్లవానోన్స్ అండ్ కంఫోర్‌టేస్ట్ ఎమినో యాసిడ్ న్యూటర్న్ టెంప్లేట్, అనే అంశంపై కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసినట్లు తెలిపారు. సుకుమార్ హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వంతెన నిర్మాణం ప్రారంభం


కాళంగి నదిపై వంతెన నిర్మాణ పనులు


కాళంగి నదిపై బ్రిడ్జి నిర్మాణ వివరాలు

దొరవారిసత్రం : రైతులు, ప్రజలు శ్రేయస్సునే దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 2023–24లో రూ.12.30 కోట్లతో వెదురుపట్టు గ్రామ ప్రాంతంలోని కాళంగి నదిపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. ఈ పనులు చకచకా సాగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తయితే దొరవారిసత్రం, సూళ్లూరుపేట, బుచ్చినాయుడు కండ్రిగ మండల మారుమూల ప్రాంతాల్లోని ప్రజల రాకపోకలు సులువు కావడంతో పాటు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అందరూ ఆశిస్తున్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం


సైక్లింగ్‌లో కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్

వెంకటగిరి రూరల్: ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం సొంతమవుతుందని 9వ బెటాలియన్ కమాండెంట్ ఈ ఎస్ఎస్ ప్రసాద్ వెల్లడించారు. ఫిట్ ఇండియా ఫిట్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 9వ బెటాలియన్ నుంచి శ్రీకాళహస్తి మండలం వాంపల్లి హెచ్‌పి పెట్రోల్ బంక్ వరకు సుమారు 3 కిలో మీటర్లు సిబ్బందితో కలిసి సైక్లింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఈ సైక్లింగ్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఆనంద్‌కున్నా, రామకృష్ణ, డీఎస్పీ ఎన్‌హెచ్ విజయానంద్, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ఆరంభం


క్రికెట్ పోటీలను ఆరంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు: ఉపాధ్యా య దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఉపాధ్యాయులకు ప్రగతి సేవా సంస్థ క్రికెట్ పోటీలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదివారం అట్టహాసంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యాయ క్రికెట్ పోటీలను ఆరంభించారు. అంతకు ముందు ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ఆరంభించారు.

శునకాలు పట్టేస్తున్నాయి


వాహనచోదకులను వెంటాడుతున్న కుక్కలు


అశోక్ స్తంభం కూడలి రోడ్డుపై కుక్కల గుంపు

వాకాడు: మండలంలో కొంతకాలంగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలు సైతం ప్రజలు రోడ్డు మీదకు రావాలంటేనే హడలిపోతున్నారు. వారం రోజులుగా ఓ పిచ్చి కుక్క దళితవాడలో వీరంగం చేసి, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. బజారు వీధి, దళితవాడ, బీసీ కాలనీ, గమళ్ల పాళెం, టెంకాయతోపు, జనార్దన్ రెడ్డి కాలనీ బసమ్మకండ్రిగ, నాయీబ్రాహ్మణ కాలనీలో పలువురు కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు కుక్కలదాటికి బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల నియంత్రణలో అధికారులు ఉదాసీన వైఖరిని అవలంబించడంతోనే కుక్కల సంతతి పెరిగిపోయింది. రోడ్డుపై కుక్కలు గుంపులు గుంపులుగా చేరి రహదారులపై వచ్చిపోయే వాహనదారులపై దాడి చేసి వాహనాలను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. కుక్కల దాడిలో ఎక్కువగా చిన్నారులే గాయపడడం విశేషం. కొందరు వైద్యం చేయించుకునే స్తోమత లేక నాటు మందుల వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఈ సమస్య ఒక్క వాకాడు పంచాయతీలోనే కాకుండా మండలంలోని 19 పంచాయతీల్లో ఇదే సమస్య నెలకొంది. పంచాయతీ పరిధిలో దాదాపు 354కు పైగా కుక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు		01-9-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	120
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	220
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	242
లేయర్ చికెన్	:	210

కండలేరులో 36.720 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 36.720 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,200, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన క్రీడా దినోత్సవం


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్‌లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చివరి రోజు విద్యార్థులు విద్యానగర్ నుంచి గూడూరు వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించి క్రీడలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు.